ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15 సంచిక : 12 ఆగష్టు 2010

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ....... 01-07-2010

హైదరాబాద్ .. 25-07-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## 'ఉన్నది బ్రహ్మమొక్కటే' - పుస్తక సమీక్ష

ఉత్తమ సంస్కారవంతులు, గురునిష్ఠాపరులు శ్రీ కె.వి. రమణ గారు మరియు జె.యస్.వి. ప్రసాద్ గారిచే పుస్తక రూపము కల్పింపబడిన సద్గురు శ్రీ నాన్నగారి జ్ఞాన ప్రవచనాల సారమైన 'ఉన్నది బ్రహ్మమొక్కటే' పుస్తకము నూటికి నూరుపాళ్ళు ఆత్మజ్ఞాన పిపాసులకు అనుగ్రహింపబడిన ఒక అపూర్వ కానుక.

ప్రత్యక్షానుభవం కలిగియుండడం ఒక ఎత్తు, దానిని సామాన్యులకు అర్థమయ్యే రీతిలో బోధించడం ఒక ఎత్తు, ఈ రెండింటిలోనూ శ్రీ నాన్నగారు సర్వ సమర్థులు. సద్గురు శ్రీ నాన్నగారు అనేక సందర్భాలలో, అనేకచోట్ల బోధించిన జ్ఞానవిద్యను మనం కష్టపడి సేకరించే శ్రమలేకుండా రచయితలు ఆ శ్రమ తామేపడి గురుసన్నిధిలో సేకరించిన అమృతవాణిని సిద్ధాన్నంగా అమర్చిపెట్టారు.

శ్రీ నాన్నగారు ఈ పుస్తకంలో అతి సామాన్యులకూ అర్థమయ్యే రీతిలో, వివిధ దృష్టాంతాలతో, సాధనాగమ్యాన్ని, ఆత్మతత్వాన్ని సూటిగా వివరించారు. ఈ పుస్తకంలో సద్గురు శ్రీ నాన్నగారు మనకు అందించిన అద్వైత జ్ఞానసూత్రంతో మొదలై, బ్రహ్మము యొక్క సత్యత్త్వము, ప్రపంచం యొక్క మిధ్యాతత్త్వము, విషయచింతనలోని దోషము, ఏక చింతన, మనోనాశం, భక్తి, ప్రేమ, సత్యాన్వేషణ, నేనెవరు? మున్నగు ఆత్మజ్ఞాన గుళికలు వివిధ హెడ్డింగులతో సవివరంగా పొందుపరచబడినవి. 'ఉన్నది బ్రహ్మమొక్కటే' పుస్తకములోని ప్రతి వాక్యం కేవల అస్థిత్వంలోకి మనను మేల్కొలిపేదిగా ఉంది. గంభీరమైన ఆత్మతత్వాన్ని సరళమైన భాషలో, సులభంగా అర్థంచేసుకొని, ఆచరణలో పెట్టుటకు వీలుగా గ్రంథస్థం చేయుట జరిగినది. ఈ పుస్తకాన్ని శ్రద్ధగా అధ్యయనం చేసి, మననం చేస్తే, గురువు అనుగ్రహం వల్ల భ్రాంతి రూపమైన అవిద్యనుండి విడుదల పొందుతాము. ముముక్షువులందరూ ఈ పుస్తకంలోని తత్త్వ సారాన్ని గ్రహించి, పరమాత్మతో మనకున్న అభేదత్వాన్ని అనుభవైకవేద్యం చేసుకోవాలని, అందుకు సద్గురు శ్రీ నాన్నగారి కరుణను మన మీద ప్రసరింపజేయాలని ప్రార్థించుచున్నాను.

ఓం తత్ సత్!

\- చావలి సూర్యనారాయణమూర్తి, టీచర్, అమలాపురం

# (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 01-07-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వ్యాసుడు మహాభారతం వ్రాస్తూ ఈ భారతంలో లేనిది ప్రపంచంలో ఎక్కడా లేదు అని చెప్పాడు. ప్రపంచంలో లేని విషయాలు భారతంలో ఉండవచ్చుకాని భారతంలో లేని విషయాలు ప్రపంచంలో ఎక్కడా లేవు. ప్రపంచంలో ఎన్ని రకాల మనుషులు ఉన్నారో అన్ని రకాల మనుషులు మనకు భారతంలో కనిపిస్తారు. భారతంలో అంతర్భాగమే భగవద్గీత. సంజయుడు ధృతరాష్ట్రుడితో ఏమని చెపుతాడు అంటే మీ వెనకాల జనం ఎక్కువగా ఉన్నారు. పాండవుల వెనకాల జనం తక్కువగా ఉన్నారు. అయినప్పటికీ సకలవిద్యలకు పరమేశ్వరుడు అయిన కృష్ణుడు ఎక్కడ ఉంటాడో, కష్టపడి పనిచేసే అర్జునుడు ఎక్కడ ఉంటాడో అంటే కృషి, కృప ఇవి రెండూ ఎక్కడైతే ఉన్నాయో అక్కడ సంపదలు, విజయాలు ఉంటాయి ఇది నా నమ్మకం ధృతరాష్ట్రా అని చెప్పాడు. భగవంతుడి దయ మీద, మన కృషి మీద మనకు ఎప్పుడైతే పూర్తిగా నమ్మకం ఉందో అప్పుడు మనకు ఆత్మవిశ్వాసం కలుగుతుంది. అప్పుడు మనం ధర్మాన్ని సక్రమంగా ఆచరించగలము. భగవంతుడి దయ లేకపోతే మన వెనకాల ఎంత జనం ఉన్నా, సంపదలు ఉన్నా, మనం ఎంత ప్రయత్నం చేసినా ఆ పని పూర్తికాదు. అందుచేత ధృతరాష్ట్రా నువ్వు మా అబ్బాయిలు నెగ్గేస్తారు అని దురాశ పెట్టుకోవద్దు అని చెప్పాడు. పాపాలలో కెల్లా పెద్దపాపం సోమరితనం. అది మన కళ్ళకు కనబడదు. ఆరోగ్యంగా ఉన్నంతకాలం మన పని మనం చేసుకోవాలి. సోమరితనంగా జీవితం గడిపేద్దాము అనుకోవద్దు. బద్ధకస్తులే ఎక్కువ పాపానికి గురి అవుతారు.

తిరువాచకం తమిళనాడులో చాలా ప్రసిద్ధమైన గ్రంథం. మనం భగవద్గీత ఎలా చదువుకొంటామో వారు తిరువాచకం అలా చదువుకొంటారు. అందులో మాణిక్యవాచకర్ అంతా భక్తి గురించి చెప్పాడు. తిరువాచకం గురించి తమిళనాడులో ప్రజలు ఏమంటారు అంటే మీకు పూర్వజన్మల నుండి వచ్చిన వాసనలు, బలహీనతలు, దోషాలు ఏమైనా ఉంటే తిరువాచకం శ్రద్ధగా చదవగా చదవగా మీలో ఉన్న వాసనలు, బలహీనతలు అన్నీ కాలిపోతాయి అని అంటారు. అది తిరువాచకం యొక్క గొప్పతనం. తిరువాచకం చదివే వారికి ఈశ్వరుడి మీద సజీవమైన భక్తి కలుగుతుంది. మాణిక్యవాచకర్ రాజకీయంగా పెద్ద పెద్ద పదవులు చేసాడు. ఆయన పూర్వజన్మలలో శివభక్తుడు. మన భద్రాచలరామదాసు దేవుడికోసం డబ్బు ఎలా ఖర్చు పెట్టేసాడో అలాగ మాణిక్యవాచకర్ మధురైలో ఉండగా గవర్నమెంటువారు గుర్రాలు కొనమని డబ్బు ఇస్తే ఆ డబ్బుతో శివాలయాలు బాగుచేయిచటం

మొదలుపెట్టాడు. అప్పుడు గవర్నమెంటువారు ఆయనను తీసుకొనివెళ్ళి జైలులో పడేసారు. ఇదంతా శివుడు ఆడిన నాటకం. వీడు రాజకీయాలలో కొట్టుకొనిపోతున్నాడు వీడి బుర్ర మార్చేయాలి అని ఈ గొడవ అంతా శివుడే చేసాడు కాని ఆయన మనకు పైకి కనబడడు. మాణిక్యవాచకర్‌ను జైలులో పడేస్తే అప్పుడు శివుడు ఏమి చేసాడు అంటే మధురై ప్రక్కన ఒక నది ఉంది, ఆ నదికి వరద సృష్టించి మధురై అంతా ముంచేటట్లు చేసాడు. ఎంతమంది ప్రజలు వచ్చి కట్టలు ఎత్తు చేసినా నీరు వచ్చి మధురైలో పడిపోతోంది. మాణిక్యవాచకర్‌ను జైలులో పెట్టటం వలన ఈ తిప్పలు వచ్చాయి అని శివుడు చెపితే అప్పుడు మాణిక్యవాచకర్‌ను వదిలేసారు. అప్పుడు ఆయనకు పూర్వజన్మ స్మృతి కలిగి ఈ రాజకీయాలు అన్నీ వదిలేసాడు. ఆయనకు ఆచార్యులవారిలాగ మనం చెప్పాలి, వీళ్ళందరూ చదువుకోవాలి అని ఏమీ లేదు. మాణిక్యవాచకర్‌కు లోకవాసన లేదు, శాస్త్రవాసన లేదు, దేహవాసన లేదు. శివుడి మీద ప్రేమ తప్పించి ఆయనకు ఏ గొడవ అక్కరలేదు. ఆయన శివక్షేత్రాలు అన్నీ తిరిగాడు, అరుణాచలం కూడా వచ్చాడు, చివరి రోజులలో ఆయన చిదంబరంలో గడిపాడు. ఆయనకు శరీరం పడిపోయే టైము వచ్చేస్తోంది. ఈయన నోటి నుండి వచ్చిన పాటలు గాలిలో కలిసిపోతున్నాయి. వీటిని తరువాత తరాలకు అందించాలి అని శివుడికి సంకల్పం వచ్చింది. అప్పుడు శివుడు ఒకరోజు రాత్రి మాణిక్యవాచకర్ దగ్గరకు వెళ్ళి మీరు పాటలు పాడతారట కదా ఒకసారి పాడండి అని చెప్పాడు. ఆయన శివుడు అని మాణిక్యవాచకర్‌కు తెలియదు. నేను ఎప్పుడో పాటలు పాడినమాట నిజమే, అవి అన్నీ ఇప్పుడు ఎక్కడ జ్ఞాపకం ఉంటాయి, జీవితం పొడుగునా పాడుతున్నాను, అవి అన్నీ ఆలోచించి పాడినవికాదు, ఆ టైములో స్ఫురించింది పాడాను అని చెప్పారు. తరువాత ఆయన పాడగా పాడగా ఆ పాటలకు అంతులేదు, ఆ పాటలను వ్రాస్తూ ఇంక వ్రాసింది సరిపోతుంది అని నటరాజు అనుకొని ఆయన కళ్ళు మూసుకొని పాడుతూ ఉంటే ఈయన గుడిలోనికి వెళ్ళిపోయాడు. ఆయన అలా పాడుకొని పాడుకొని తరువాత కళ్ళు తెరిచి చూస్తే అక్కడ రాసుకొనేవాడు లేడు. ఉదయం అర్చకులు తలుపులు తీసుకొని లోపలకు వెళితే నటరాజు పాదాల దగ్గర పుస్తకం ఉంది. ఆ పుస్తకం తెరచి చూస్తే మాణిక్యవాచకర్ చెప్పగా వ్రాసాను అని నటరాజు సంతకం ఉంది. మనం తలుపులు వేసుకొని వెళ్ళాము, ఇదంతా ఆశ్చర్యంగా ఉంది అని అర్చకులు మాణిక్యవాచకర్ దగ్గరకు వెళ్ళి ఇందులో చాలా పాటలు ఉన్నాయి, వాటి అర్థం ఏమిటి వివరించాలి కదా అని అడిగారు. మీకు అర్థం కావాలా మీరు గుడిలో నుండి వచ్చారు కదా నేను గుడికి వస్తాను వెళదాము రండి అని చెప్పాడు. ఆయన ఏమి చెప్పాడు అంటే వాటికి అర్థాలు, తాత్పర్యాలు ఏమిటయ్యా అర్థమూ నటరాజే, తాత్పర్యమూ నటరాజే అంతా శివుడే అని చెప్పాడు. మాణిక్యవాచకర్ నోటినుండి ఆ

మాటరాగానే ఆయన శరీరం కరిగిపోయి ఒక జ్యోతికింద అక్కడ ఉన్న అర్చకులు అందరూ చూస్తూ ఉండగా వెళ్ళి నటరాజులో ఐక్యమైపోయింది, వాడు మాణిక్యవాచకర్.

ప్రతీ మనిషికి మూడు గుణాలు ఉంటాయి. బ్రాహ్మీస్థితి పొందినవాడు ఈ మూడు గుణాలను దాటి వెళ్ళిపోతాడు. మిగతా మనుషులు రోజుకోరకంగా ఉంటారు. సత్వగుణం ఉన్నప్పుడు ఒక రకంగా మాట్లాడతారు, రజోగుణం ఉన్నప్పుడు ఒకరకంగా మాట్లాడతారు, తమోగుణం ఉన్నప్పుడు ఒకరకంగా మాట్లాడతారు. ఈ మూడు గుణాలు లేని మనిషి ఉండడు. ఈ మూడు గుణాలలో సత్వగుణం మంచిదే. రజోగుణం రెండో పక్షం. తమోగుణం ఉన్నవాడికి కంచం, మంచం తప్పించి ఇంక ఏమీ ఉండదు. సత్వగుణం ఉన్న మనిషి ఎలా ఉంటాడు, రజోగుణం ఉన్న మనిషి ఎలా ఉంటాడు, తమోగుణం ఉన్న మనిషి ఎలా ఉంటాడు అని వేదాలలో చాలా వివరంగా ఈ మూడు గుణాలగురించి చెప్పారు. ఈ మూడు గుణాలను ఒకేసారి మనం జయించలేము. మనం సత్వగుణాన్ని జాగ్రత్తగా పెంచుకొంటూ ఉంటే మిగిలిన గుణాలు నెమ్మదిగా తగ్గిపోతాయి. సత్వగుణం కూడా గుణమే కాని అది మనకు ఉపకారం చేస్తుంది కాబట్టి దానిని అభివృద్ధి చేసుకోమని చెపుతున్నారు.

మీకు ఏమైనా కోరికలు ఉన్నాయి అనుకోండి, ఏ పూజ చేస్తే, ఏ యజ్ఞం చేస్తే ఏ కోరిక నెరవేరుతుందో వేదంలో చెప్పారు. ఈ గుణాల గొడవ, కోరికల గొడవ వదిలేయవయ్యా అని పరమాత్మ చెపుతున్నాడు. ఇప్పుడు నువ్వు ఒక కోరిక తీర్చుకొంటావు అనుకో ఇంకో కోరిక వచ్చేస్తుంది. ఆ కోరికని తీర్చుకొంటావు అనుకో ఇంకో కోరిక వచ్చేస్తుంది. ఇలా ఎన్ని కోరికలు అని నెరవేర్చుకొంటావు. వచ్చిన కోరికలను నెరవేర్చుకొంటూ కోరికలను జయించిన వాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు అని పరమాత్మ చెపుతున్నాడు. అందుచేత ఈ గొడవలు నీకు వద్దు. ఈ దేహం ఏ ప్రారబ్దం అనుభవించటానికి ఈ భూమి మీదకు వచ్చిందో అది జరిగిపోతూ ఉంటుంది. నువ్వు మరల కొత్త గొడవలు తెచ్చుకోవద్దు. ఈ గుణాల గొడవ వదిలేసి గుణాలను దాటి వెళ్ళిపో. ఈ గుణాలలో ఉన్నంతకాలం నీ బుద్ధికి స్థిరత్వం రాదు. రోజుకో రకంగా ఉంటావు. ఈ గుణాలను దాటి పోయావు అనుకో ఇంక నిన్ను ఎవ్వరూ బంధించలేరు. సత్వగుణం మంచిదేకాని దానిని కూడా వదిలెయ్యి. ఏదైతే నిత్యమో, ఏదైతే సత్యమో, ఏదైతే ఆనంద స్వరూపమో, ఏదైతే జ్ఞానస్వరూపమో, ఏ వస్తువును తెలుసుకొన్నాక ఇంక నీకు ఇతర లోకాలకు ప్రయాణం చేయవలసిన పనిలేదో అటువంటి నిత్యసత్య వస్తువు యందు నీ మనస్సును నిలబెట్టు అంతేగాని ఈ గుణాల గొడవ, కోరికల గొడవ నీకు వద్దు అంటున్నారు పరమాత్మ.

ప్రారబ్ధం లేకుండా దేహం రాదు. మాణిక్యవాచకర్ అంతటివాడు జైలులో ఉన్నాడు కదా. ఆయన పెద్ద పెద్ద పదవులు చేసాడు. గుర్రాలను కొనమని డబ్బు ఇస్తే కొనటం మానేసి శివాలయాలు బాగుచేయాలనే బుద్ధి కలిగింగి. ఆ బుద్ధి మంచిదే. అది ఈశ్వరుడు కలుగజేసాడు ఎందుచేతనంటే ఆయనను రాజకీయాలనుండి బయటకు లాగి ఆయనవైపుకు తీసుకోవటానికే అది అంతా చేసాడు. మనకు ఏమి అనిపిస్తుంది అంటే మాణిక్యవాచకర్ లాంటివాడు గుర్రాలను కొనమని డబ్బుఇస్తే కొనటంమానేసి శివాలయాలు బాగుచేయించటం ఏమిటి, తప్పు చేసాడు అనిపిస్తుంది కాని ఇది అంతా ఈశ్వరుడి పన్నాగం, ఆయన ఆట. ఆడినవాడు మాణిక్యవాచకర్, ఆడించినవాడు శివుడు. ఈ దేహం మరణించేలోపులో నీకు సంతోషం వస్తూ ఉంటుంది, దుఃఖం వస్తూ ఉంటుంది. సంతోషం వచ్చినప్పుడు పొంగిపోవద్దు, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోవద్దు. నువ్వు నిర్మలంగా వాటిని ఫేస్ చెయ్యాలి. మీకు ఏదైనా నష్టం వస్తే ఇంట్లో కూర్చొని ఏడుస్తూ ఉంటారు, ఏదైనా లాభం వస్తే సంతోషంతో రోడ్డు మీద వచ్చి పడిపోతారు. నీ దేహప్రారబ్ధాన్నిబట్టి ఒకోసారి లాభం వస్తుంది, ఒకోసారి నష్టం వస్తుంది. ఇవన్నీ ద్వంద్వాలు. ఏదైనా మాయే. సంతోషం ఒక మాయ, దుఃఖం ఒక మాయ. ముందు ఈ గొడవలు వదిలెయ్యి అని పరమాత్మ చెపుతున్నాడు. మీకు దుఃఖం వస్తోంది అనుకోండి. కొంతమంది గురువులు ఆ దుఃఖాన్ని తప్పించగలరు. కాని గురువు ఏమి ఆలోచిస్తాడు అంటే అది ఈశ్వర నిర్ణయం, దానిని మనం తప్పిస్తే వారు వచ్చే జన్మలో అయినా దానిని అనుభవించాలి. అసలు భరించకుండా నేను ఆపుచేయలేను. ఈ జన్మలో తప్పిస్తే దానిని అనుభవించటానికి మరల జన్మ ఎత్తాలి అంటే జన్మలను పెంచినవారము అవుతాము అని గురువు క్వయిట్‌గా ఉంటాడు. మీరు దుఃఖపడుతూ ఉంటే గురువు దుఃఖపడతాడు, ఆ దుఃఖాన్ని తట్టుకొనే శక్తిని నీకు ప్రసాదిస్తాడు. కాని దుఃఖాన్ని ఆపటానికి చూడడు. భగవాన్‌తో ఎవరైనా ఇటువంటి విషయాల గురించి అడిగితే కొండశిఖరం చూపించి మరి ఆయన నిర్ణయం అలా ఉంది అనేవారు.

వారు మనల్ని బాగా చూస్తారు, వీరు మనల్ని బాగాచూస్తారు అని లెక్కలు వేసుకోవద్దు. మీకాళ్ళమీద మీరు నిలబడటానికి ప్రయత్నం చేయండి. ఈ మధ్య ఎవరో ఒక ఆవిడ నాకు 30 ఎకరాలు ఉందండి. ముగ్గురు కూతుళ్ళు ఉన్నారు. ముగ్గురికీ మూడు పదులు రాసిచ్చేసాను అని చెప్పారు. అయితే మీరు తప్పనిసరిగా బాధలు పడతారు అని చెప్పాను. వారు ముగ్గురూ మిమ్మల్ని చూస్తారని అనుకోవద్దు. వారు బుద్ధిమంతులు అనుకొన్నా వారు మారిపోతూ ఉంటారు. ఎందుచేతనంటే వారు గుణాలలోనే ఉన్నారు కదా. మీరు బతికి ఉండగానే నరకాన్ని చూస్తారు అని చెపితే అదేమిటండీ భగవంతుడే చూసుకొంటాడు అన్నారు.

ఈశ్వరుడిమీద నిజంగా మీకు నమ్మకంగా ఉంటే ఒక ఎకరం ఆయనకు వ్రాసి ఇచ్చారా? లేదు కాని ఈశ్వరుడు మిమ్మల్ని చూడాలి ఎంత గొప్పగా మాట్లాడుతున్నారు. ఆవిడకు ఎంతోకొంత భక్తి ఉంది కాని ఆవిడ అలా చేయటానికి మమకారం కారణం. అది ఆవిడకు తెలియటంలేదు. మీ కూతుళ్ళు చెడ్డవారు అని నేను అనటంలేదు. పొలం వ్రాసి ఇచ్చినప్పడు బాగానే ఉంటారు. వారు గుణాలలో ఉన్నారు కదా ఆ గుణాలు మారిపోతూ ఉంటాయి. మీరు ఇచ్చినప్పడు తినేస్తారు ఎందుకు చూడటంలేదు అంటే ఏవో కారణాలు చెపుతారు. మనోనాశనం అయినవాడు, త్రిగుణాలు దాటినవాడు విషయం వేరు, మీకు సంబంధించినంత వరకు జాగ్రత్తగా ఉండటం మంచిది. ఈ విషయం నేను లౌకికంగా చెపుతున్నాను, ఆత్మజ్ఞానం కలిగితే ఇంక ఈ గొడవలు ఏమీ లేవు. కొంతమంది వారికి తల్లితండ్రులు ఏమీ ఇవ్వకపోయినా చూస్తున్నారు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారికి తల్లితండ్రులు 30 ఎకరాలు, 40 ఎకరాలు ఇచ్చినా వారిని చూడరు సరికదా కనీసం పలకరించరు. తల్లితండ్రులు ఏమనుకొంటారు అంటే వాడికి చాలా ఇచ్చాను పలకరించటం లేదు అని ఏడుస్తారు. పలకరించకపోవటం మంచిదే మనకి టైము కలసి వస్తుంది అని వీళ్ళు అనుకోరు. కొడుకులు, కూతుళ్ళు పలకరించకపోవటం మనకు లాభం. దాని వలన మనకు టైము కలిసివస్తుంది. వారు పలకరిస్తే మనం కూడా మాట్లాడాలికదా. వారు పలకరించటం వలన మనకు మోక్షం రాదు, పలకరించకపోతే నరకం రాదు. ఇదంతా మన మనస్సు కల్పిస్తోంది. మనోనాశనం అయ్యేవరకు ఏదో రూపంలో దుఃఖం వస్తూనే ఉంటుంది.

ప్రతీ మనిషికి ద్వంద్వాలు వస్తూ ఉంటాయి. ఆ ద్వంద్వాలు వచ్చినప్పడు భరిచటం నేర్చుకోండి. అంతేగాని కంగారు పడిపోయి మీ భక్తిని చెదరగొట్టుకోవద్దు. మీకు దుఃఖం వచ్చినప్పడు దుఃఖం మీద, సంతోషం వచ్చినప్పడు సంతోషం మీద మీ మనస్సును పెట్టకండి. మాణిక్యవాచకర్‌లాగ ఎప్పడూ మీ మనస్సును ఈశ్వరుడిమీద ఉంచండి. ఈశ్వరుడి మీద మీ మనస్సు ఉంటే ఈ సంతోషంగాని, దుఃఖంగాని ఏదీ మిమ్మల్ని ముట్టుకోదు. పరమేశ్వరుని పాదాలమీదే మీ మనస్సును నిలబెట్టి ఉంచండి, నిరంతరం ఆయననే చింతించండి. ఆయన దయలేకపోతే మనం ఎంత ప్రయత్నం చేసినా మన మనస్సు ఆయన పాదాలమీద నిలబడదు.

నీ యోగక్షేమాల గురించి ఆసక్తి పెట్టుకోవద్దు. ఎవరు వచ్చినా వారి కుటుంబ గొడవలు చెపుతున్నారు. లౌకికులు అంతే, భక్తులు అంతే, వారి యోగక్షేమాలు తప్పించి ఈశ్వరుడి పేరు ఎత్తటం లేదు. రామకృష్ణపరమహంస దగ్గరకు అటువంటివారు వస్తే వారు వెళ్ళిన తరువాత ఆ రూము అంతా కడిగించేసేవాడు. తరువాత కాళీమాత దగ్గరకు వెళ్ళి ఇటువంటి వారిని నా దగ్గరకు పంపుతున్నావు ఏమిటి అని ఏడ్చేవాడు. కాళీమాత ఏమి చెప్పేది అంటే నువ్వు కొంచెం

ఓర్చుకో, ఆధ్యాత్మికంగా చాలా బలమైన వారు ఇంక కొద్ది రోజులలో నీ దగ్గరకు వస్తారు, ఈ జనం తగ్గిపోతారు అని చెప్పేది. తరువాత కొంతకాలానికి నరేంద్రుడు, బ్రహ్మానంద ఇలా మంచి భక్తులు వచ్చారు. అందరూ వారి యోగక్షేమాల గురించి ఆలోచించుకొంటున్నారు కాని భగవంతుడి సంకల్పాన్ని బట్టి యోగక్షేమాలు వస్తాయి. ఒకవేళ నీ ప్రారబ్ధంలో లాభం రావలసి ఉంటే వస్తుంది కాని దానిమీద ఆసక్తి పెట్టుకోవద్దు. ఫలకాంక్ష పెట్టుకోవద్దు. 24 గంటలు యోగక్షేమాల గురించి ఆలోచిస్తూ ఉంటే ఇంక నీకు భక్తి ఏమిటి? మనం ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకొంటామో అలాగ అంతఃకరణాన్ని కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. అంతఃకరణాన్ని శుద్ధి చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి.

ఒకసారి మురుగునార్ ఏమన్నారు అంటే మీరు సాధన చెయ్యాలి అంటే, నిజంగా భక్తులు అవ్వాలి అంటే ఖరీదైన బట్టలు కట్టుకోవద్దు, ఖరీదైన ఆహారం తినవద్దు. ఎక్కువగా ఖర్చులకు అలవాటుపడవద్దు. మిమ్మల్ని శుభ్రంగా ఉండవద్దు అనికాదు సామాన్యమైన బట్టలు సరిపోతాయి, సామాన్యమైన ఆహారం సరిపోతుంది. ఖరీదైన బట్టలు వేసుకొంటూ, ఖరీదైన ఆహారం అతిగా తింటూ ఉంటే మనస్సుకు రజోగుణం వచ్చేస్తుంది అనేవారు. మీ డబ్బు చూసుకొని మీ మనస్సును పాడుచేసుకోవద్దు. మాణిక్యవాచకర్‌కు శరీరం కాలిపోయింది, లోపల అంతఃకరణం కూడా కాలిపోయింది. ఎందుచేతనంటే అప్పటికే అంతఃకరణం శుద్ధి అయిపోయింది. ఈ రెండూ కాలిపోయినియ్యి కాబట్టే ఆయన నటరాజ్‌లో ఐక్యం అయ్యాడు. అంతఃకరణం కాలలేదు అనుకోండి ఆయన నటరాజ్‌లో ఐక్యంకాలేడు. మీకు డబ్బులు ఉంటే బ్యాంక్‌లో దాచుకోండి, లేకపోతే స్థలాలు కొనుక్కోండి కాని మీ అంతఃకరణాన్ని ఎప్పుడూ పవిత్రంగా ఉంచుకోండి. పవిత్రత చాలా ముఖ్యం, రామకృష్ణుడు సాధనలో అలా ఉండేవాడు. ఆయన అంతఃకరణంలో ఎప్పుడూ చెడుతలంపు రానిచ్చేవాడుకాదు. ఎప్పుడైనా చెడుతలంపు వచ్చినా ఎందుకు నాకు ఈ చెడుతలంపు వచ్చింది అని అమ్మ దగ్గరకు వెళ్ళి ఏడ్చేవాడు. ఆయన అంతఃకరణంలో ఏ దోషము రానిచ్చేవాడుకాదు. మీ గుణాలు మంచివి అనుకో, మీ మనస్సు శుద్ధిగా ఉంది అనుకో మీతో ఎక్కువగా మాట్లాడేవాడు. రామకృష్ణుడు నరేన్‌తో ఎక్కువగా మాట్లాడేవాడు. ఇంతమంది జనం ఉన్నారు మీరు అస్తమాను నాతోటే మాట్లాడితే చూసేవారికి బాగుండదు, నా ప్రక్కన ఉన్నవారితో కూడా మాట్లాడండి అని నరేన్ రామకృష్ణుడితో చెప్పేవాడు. ఓ నరేన్ నేను నీతో మాట్లాడాలని మాట్లాడటంలేదు, నీతో మాట్లాడకుండా ఉండలేకపోతున్నాను, నీ గుణసంపద అటువంటిది అనేవారు రామకృష్ణుడు. నరేన్ బయటకు వెళ్ళాక అక్కడ ఉన్న కొంతమంది రామకృష్ణుడితో వాడు సిగరెట్లు కాలుస్తున్నాడు, అది మీకు తెలియదు, వాడు గొప్పవాడని పొగిడేస్తున్నారు అని అంటే

రామకృష్ణుడు ఏమన్నాడు అంటే పెద్ద అగ్నిహోత్రంలో రాయివేస్తే అగ్నిహోత్రం ఆరిపోతుందా? ఆరదు అలాగే వాడి గుణసంపదముందు వాడు ఎప్పుడైనా సిగరెట్ కాల్చుకొన్నా అంతమాత్రంచేత వాడు పాడైపోడు, వాడు సిగరెట్ కాలుస్తున్నాడు అని అటువంటి గొడవలు మొదలుపెడితే వాటివలన మీరు పాడైపోతారు అని రామకృష్ణుడు చెప్పాడు.

ఒకసారి మాణిక్యవాచకర్ ఏమన్నాడు అంటే నాకు శరీరం ఉందని నాకు తెలుస్తూ ఉంటే నేను భక్తుడిని ఎలా అవుతాను. శరీరం ఉన్నా నాకు శరీరం లేదు అని అనుభవంలోనికి రావాలికదా అన్నాడు. ఎంత వండర్‌ఫుల్‌గా చెప్పాడో చూడండి. ఈ శరీరానికే పరిమితమైతే నేను భక్తుడిని ఎలా అవుతాను. శరీరం ఉండగా శరీరంలేని స్థితిని పొందితే అపుడు భక్తుడిని అవుతాను. మనం మంచినీళ్ళు తాగాలి అనుకోండి. నుయ్యి దగ్గరికి వెళ్ళాలి లేకపోతే చెరువు దగ్గరకు వెళ్ళాలి. మనం ఎక్కడ చెయ్యివేస్తే అక్కడ మంచినీళ్ళు దొరుకుతున్నాయి అనుకోండి ఇంక వాడు నూతుల దగ్గరకు, చెరువుల దగ్గరకు వెళ్ళనక్కరలేదు. అలాగే బ్రహ్మానందం పొందిన వాడికి ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా సుఖమే. ఇంకవాడికి విషయ సుఖాలతో పని ఏముంది, విషయాల మీదకు వాడి మనస్సును తరిమినా అది వెళ్ళదు. వాడు పూర్ణంగా ఉంటాడు, వాడు సముద్రుడు. నదులన్నీ వెళ్ళి సముద్రంలో కలిసినా, ఒకవేళ నదులు అన్నీ సముద్రంలో కలవకపోయినా సముద్రం ఒకేలాగ ఉంటుంది. అలాగే బ్రాహ్మీస్థితి పొందినవాడు సంపదలు వచ్చి వాడిమీద పడినా, ఒకవేళ సంపదలు రాకపోయినా వాడికి ఏమీ అనిపించదు. వాడు బయట గొడవలమీద దేనికి ఆధారపడడు. వాడు స్వస్థానంలో, వాడు స్వస్థితిలో వాడు ఉంటాడు. రామకృష్ణ పరమహంస దగ్గర కూర్చొని ఎవరైనా విషయ చింతన చేస్తూ ఉంటే ఏదోవంపు పెట్టి, అవసరం అయితే అబద్దాలు కూడా చెప్పి మిమ్మల్ని తొందరగా పంపేస్తాడు. రామకృష్ణుడి ఉద్దేశం ఏమిటి అంటే విషయచింతనే విషం, అది నీ అంతఃకరణాన్ని పాడుచేస్తుంది. భవిష్యత్‌లో అనేక నీచజన్మలకు అదే కారణం అవుతుంది. మనకు దైవచింతన లేదు అనుకోండి విషయచింతన వచ్చేస్తుంది. విషయచింతన వలన మనం నెమ్మదిగా పొల్యూట్ అయిపోతాము.

ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉండి ప్రారబ్దాన్ని బట్టి ఈ దేహాలను ఆడిస్తున్నాడు. ఆయన సంకల్పమే జరుగుతుంది. మీరు ఇక్కడకు వచ్చి సబ్జక్టు వింటున్నారు. మీరు బయలుదేరేటప్పుడు ఎవరైనా బంధువులు మీ ఇంటికి వచ్చారు అనుకోండి మీరు ఆగిపోతారు కదా, అంటే అది కూడా మీ చేతిలో లేదు. నిన్న గుండుగొలను నుండి ఎవరో వచ్చి జ్యోతికి కొంచెం తేడాగా ఉంది, వాళ్ళ అమ్మగారు భీమవరం హాస్పటల్‌కు తీసుకొనివెళ్ళారు అని చెప్పారు.

రేపే మీటింగు వాళ్ళ అమ్మగారు రారు, జ్యోతిరాదు అని నేను మనస్సులో అనుకొన్నాను. జ్యోతి రాలేదు గాని వాళ్ళ అమ్మగారు వచ్చారు. ఇందులో మన తలంపు ఏమైంది. అనుకొనేది జీవుడి సంకల్పం, జరిగేది ఈశ్వరుడి సంకల్పం. నీ ఇష్టం వచ్చినట్లు 90 అనుకోగాని ఈశ్వర సంకల్పమే జరుగుతుంది. ఈశ్వరసంకల్పం బలీయమైనది, నువ్వు దానిని ఆపుచేయలేవు. ఇంట్లో అందరికీ చదువులు చెప్పించాము, అక్కడ పొలాలు కొన్నాము, ఇక్కడ స్థలాలు కొన్నాము, మేము జీవితంలో చాలా సాధించాము అని కొంతమంది చెపుతూ ఉంటారు. సాధించటానికి వీడు ఎవడు. వారికి చదువులు వస్తే చెప్పించారా, చదువులు రాకుండా వాళ్ళకు చెప్పించారా. ఇవన్నీ జీవలక్షణాలు. ఇలా అనుకోవటం వలన చివరకు జన్మలు పెరిగిపోతాయి. ఈ కుటుంబాన్ని మేమే అభివృద్ధిలోనికి తీసుకొనివచ్చాము, చాలా కష్టపడ్డాము, ఎవడికీ కృతజ్ఞత లేదు అంటారు. ఎవడు చేయమన్నాడు ఈ చాకిరీ అంతా వాడిని. వాడి స్వార్థంకోసం, వాడి సరదాకోసం వాడు చేసాడు. కొంతమందికి సంపద అంటే చాలా ఇష్టం. సంపద అంటే ఇష్టం కాబట్టి కష్టపడి సంపాదించుకొంటున్నాడు చివరకు ఏమి చెపుతాడు అంటే వీళ్ళందరి కోసం కష్టపడుతున్నాను అంటాడు. వీళ్ళందరికోసం కష్టపడటంకాదు వాడికి సంపాదన అంటే ఇష్టం కాబట్టి కష్టపడి సంపాదించుకొంటున్నాడు, అది పాపం అని వాడికి తెలియటంలేదు. భగవంతుడి మాయ అక్కడ తెలియనివ్వదు. మీరు మేడ కట్టుకొన్నారు అనుకోండి, పొలం కొనుక్కొన్నారు అనుకోండి మేము ఇది సాధించాము అనుకోవద్దు. అది మీ కృషితోపాటు భగవంతుడి సంకల్పం కలిసి వచ్చింది కాబట్టి అది జరిగింది కాని మీ తెలివితేటలవల్లకాదు. మీ తెలివితేటలవల్ల ఇవన్నీ చేసాము అనుకొంటే నీ అంతఃకరణం మలినమైపోతుంది, అనేక జన్మలకు కారణం అవుతుంది. అందుచేత ఇది నావల్లే అయ్యింది, ఇది నేనే సాధించాను అనే భావాలు రానివ్వకు.

మేము చాలా కష్టపడి చాకిరీ చేస్తున్నాము, మాకు ఏమి సుఖంలేదండి, ఎవరూ గుర్తించటంలేదు అని చాలామంది అంటారు. ఇక్కడ పరమాత్మ ఏమి చెపుతున్నారు అంటే నువ్వు కర్మ చేయటానికే పనికివస్తావు. ఇతరులకోసం కాకపోయినా నీపొట్ట, బట్ట, నీడకోసం నువ్వు చాకిరీ చేయాలి, ఈ మూడూ తప్పవుకదా. అందుచేత నువ్వు చేసే పని నిర్మలంగా, నిరాడంబరంగా, శ్రద్ధగా చెయ్యి. సర్వకాల సర్వావస్థలలో నీ స్వప్నంలో కూడా నువ్వు ఫలకాంక్ష పెట్టుకోవద్దు. నేను ఫలం ఇవ్వను అని పరమాత్మ చెప్పటంలేదు. నువ్వు కాంక్ష పెట్టుకోవద్దు అని చెపుతున్నాడు. ఫలకాంక్ష పెట్టుకొంటే నీ మనస్సు మలినం అయిపోతుంది. ఫలితం వస్తే పొంగిపోవద్దు, ఫలితం రాకపోతే ఎందుకురాలేదు అని కుంగిపోవద్దు. ఎందుచేతనంటే అది అంతా ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతుంది. ఇచ్చేవాడు ఈశ్వరుడే, పట్టుకుపోయేవాడు

ఈశ్వరుడే, ఈలోపుగా ఎవరైనా చెడగొట్టాలి అనుకొన్నా అది సాధ్యంకాదు. ఫలితం వచ్చింది అనుకో నేను కష్టపడటం వలననే ఆ ఫలితం వచ్చిందని మనస్సులో కూడా అనుకోవద్దు. మేము కష్టపడ్డాము, మేము కష్టపడటంవలననే ఇప్పడు మీరు సుఖపడుతున్నారు అని చాలామంది అంటూ ఉంటారు. అంటే ఆ ఫలితాన్ని వీరే సాధించారు అని అనుకొంటున్నారు కదా. అలా అనుకోవద్దు. అలా అనుకొంటే వేలాది జన్మలు పెరిగిపోతాయి. నిప్పను మనం చూస్తే కాలదు, దానిమీద చెయ్యివేస్తే కాలుస్తుంది కాని ఈ విషయాలు అనుకోవటం వలననే అవి మనలను కాల్చేస్తాయి అంటే అనేక నీచజన్మలకు కారణమవుతాయి. ఒకవేళ మీరు ఎవరినైనా చూడటం వలన మీకళ్ళు మీకు అపకారం చేస్తూ ఉంటే, మీ కళ్ళు మిమ్మల్ని మోహపెడుతూ ఉంటే ఆ కళ్ళు రెండూ పీకేసి అవతల పాడేయండి. అదే శరీరంలో మీకు గుడ్డితనం వచ్చినా ఫరవాలేదు కాని కళ్ళు చేసే అపచారం వలన మీకు వేలాది చెడ్డ జన్మలు రావచ్చు. ఏసుక్రీస్తు ఎవరిని చూసినా వారిలో ఉన్న మంచిని చూసేవాడు కాని ఎప్పడూ చెడ్డచూడలేదు, ఆయనకు చెడ్డ కనబడేదికాదు. మన బుద్ధి మంచిది కాదు అందువలన మనం ఇతరులలో ఉన్న చెడ్డను చూస్తాము కాని వారిలో ఉన్న మంచిని చూడలేము. మీరు మంచివారు కాదు అని ఎవరైనా అంటే వెంటనే కోపం వచ్చేస్తుంది, వారు అలా అంటున్నారు మనలో ఏమైనా లోపాలు ఉన్నాయేమో అని ఎవరూ చూసుకోవటంలేదు.

నేను ఇంత కష్టపడ్డాను, ఇంత సంపాదించాను, ఇదంతా నావలననే జరుగుతుంది, నేను చచ్చిపోతే వీళ్ళందరూ ఏమైపోతారు అని కొంతమంది అనుకొంటారు. ఇవన్నీ పిచ్చిచేష్టలు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారు చేసే పనులు కుటుంబానికి ఉపయోగపడవు, లోకానికి ఉపయోగపడవు అంటే వారు ఇహానికి పనికిరారు, పరానికి పనికిరారు. ఇక్కడ పరమాత్మ ఏమిచెపుతున్నాడు అంటే పని చేయమంటున్నాడు, ఫలితం వస్తుందో రాదో ఆ గొడవ నీకు వద్దు అంటున్నాడు, ఒకవేళ నిజంగా ఫలితం వచ్చినా ఆ ఫలితానికి నేను కారకుడను అని అనుకోవద్దు అంటున్నాడు, ఇన్ని రకాలుగా చెపుతున్నాను అని నువ్వు అసలు పనియందే విరక్తి పెట్టుకోవద్దు అంటున్నాడు పరమాత్మ. అంటే ఇక్కడ మనలను తలుపుసందునపెట్టి నొక్కేస్తున్నాడు. భగవంతుడు నీ శరీరానికి ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని ఇష్టంగా, ప్రేమగా చెయ్యి. పనియందు విరక్తి పెట్టుకోవద్దు. కొంతమందికి శక్తి ఉన్నా పని చేయరు. దానివలన వారికి సోమరితనం అలవాటు అయిపోతుంది. అన్ని పాపాలలోకి సోమరితనమే పెద్ద పాపం.

ఓ అర్జునా! నువ్వు నేను మాట్లాడుకున్న ఈ మాటలు అధ్యయనం చేసి అర్థం చేసుకొని,

అనుభవించి వారి దగ్గరకు ఎవరైనా జిజ్ఞాసతో వస్తే వారికి చెప్పగలిగితేవారు జ్ఞానయజ్ఞం చేసినట్లు అవుతుంది అని పరమాత్మ అంటున్నాడు అలా చెప్పటం వలన మీకు ఋషి ఋణం తీరిపోతుంది. మీ ఇంట్లో ఎవరైనా ముసలివారు ఉంటే వారిని జాగ్రత్తగా ప్రేమగా చూడటం వలన పితృఋణం తీరిపోతుంది. మీ ఇంటిదగ్గర పశువులు ఉన్నాయి అనుకోండి. వాటిని టైముకు శుభ్రంగా కడగటం, టైముకు తెలగపిండి, గడ్డిపెట్టటం చేస్తే భూతఋణం తీరిపోతుంది. మీ యోగక్షేమముల గురించే నిరంతరం ఆలోచించకుండా ఇతరులకు ఏదైనా సహాయం చేయగలిగితే మనుష్యఋణం తీరిపోతుంది. రాగద్వేషముల గొడవ వద్దు. రాగము మిమ్మల్ని బంధిస్తుంది, ద్వేషము బంధిస్తుంది. మీకు ఎక్కడా రాగద్వేషములు లేవు అనుకోండి ఇంక మీ మనస్సును కదలమన్నా అది కదలదు. మీకు ఎవరిమీదైనా రాగం ఉన్నా, ద్వేషము ఉన్నా కూడా మీ మనస్సు అక్కడకు పరుగెత్తుకొనిపోతుంది. మనస్సు యొక్క వాండరింగ్‌ను ఆపుచేయటానికే యోగం. మీకు రోగం లేనప్పుడు మందులతో పనిలేదు. అలాగే మీ మనస్సు యొక్క చలనం ఆగిపోయినప్పుడు, మీ మనస్సు స్థిరంగా ఉన్నప్పుడు ఇంక మీకు యోగంతో పనిలేదు. మనిషికి తృప్తి ఉండాలి. భగవంతుడు వారికి ఎంత ఇచ్చినా కొంతమందికి తృప్తి ఉండదు, తృప్తి లేనివాడికి ముక్తి రాదు.

ప్రపంచంలో జరిగే సంఘటనలు మీకు అనుకూలంగా ఉండవచ్చు లేక ప్రతికూలంగా ఉండవచ్చు, మనుషులు మీకు అనుకూలంగా ఉండవచ్చు లేక ప్రతికూలంగా ఉండవచ్చు, మీకు మిత్రులు ఉండవచ్చు లేక శత్రువులు ఉండవచ్చు. బయట వస్తువులమీద గాని, మనుషుల మీదగాని ఎక్కడా శాంతి కోసం మీరు ఆధారపడవద్దు. మీ హృదయంలో నుండి వచ్చే శాంతి, ఆనందం నిజమైనవి. మిగతాది అంతా స్వప్నసమానము. డబ్బువలన భోగం వస్తుంది కాని సుఖంరాదు, ఆత్మజ్ఞానం వలన సుఖం వస్తుంది. నీవు కర్మచేస్తే మంచి ఫలితమో, చెడు ఫలితమో ఏదో ఒకటి వస్తుంది, ఏది వచ్చినా ఇక్కడే వదిలెయ్యి. మనకు ఏదో కూడా పట్టుకుపోవాలని అనిపిస్తుంది. రాగద్వేషములు లేకుండా ఎవడైతే సమానబుద్ధిని సంపాదించుకొన్నాడో, వాడు శరీరం చనిపోయేటైములో ఏదైనా పుణ్యపాపములు ఉన్నా ప్రపంచం మొఖంమీద కొట్టేసి పునర్జన్మలనుండి విడుదల పొంది మోక్షాన్ని పొందుతాడు. మనం పుణ్యంకూడా రావాలి, పాపం రాకూడదు అనుకొంటాము. పుణ్యాన్ని ఆశించినప్పుడు పాపం కూడా వచ్చేస్తుంది. ఈ రెండింటిని ప్రపంచం మొఖం మీద కొట్టేయమంటున్నాడు పరమాత్మ. అంతేగాని పాపాన్ని కొట్టేసి పుణ్యాన్ని పట్టుకెళదామంటే కుదరదు. ఏదోరోజున చనిపోతావు కదా నువ్వు ఆ రోజుకి నీ బుద్ధిలో హెచ్చుతగ్గులు ఉండకూడదు, సమానబుద్ధిని కలిగి ఉండాలి నీకు సమానబుద్ధి ఎప్పుడైతే ఉందో అప్పుడు కర్మఫలం మీద నీకు కాంక్షే

ఉండదు. మనం ఎలా పనిచేస్తే ఆయనలో ఐక్యమవుతామో అవన్నీ గీతలో పరమాత్మ మనకు చెప్పాడు. మనలో అంతర్యామిగా ఉన్న పరమాత్మే కాళ్ళు చేతులు తొడుక్కొనివచ్చి మనకు గీతను బోధించాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-07-2010, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు వ్యాసపూర్ణిమ అంటే వ్యాసుడు జన్మించినరోజు. దీనినే మనం గురుపూర్ణిమగా జరుపుకొంటున్నాము. ఈ గురుపూర్ణిమరోజున ఎవరి గురువును వారు గౌరవించటం, సన్మానించటం సాంప్రదాయంగా వస్తోంది. మన భారతీయ సాహిత్యానికి వ్యాసుడు, వాల్మీకి మూలపురుషులు, వీరు ఇద్దరు మనం పూజించదగినవారు. వ్యాసుడు బ్రహ్మసూత్రాలు వ్రాసాడు, భారతం వ్రాసాడు, పురాణాలు వ్రాసాడు. ఆయన వేదాలను విభజించాడు కాబట్టి ఆయనకు వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. గురువు అంటే చీకటిని పోగొట్టేవాడు. చీకటిలో ఉన్నవాడికి దీపం ఎంత అవసరమో, అజ్ఞానంలో ఉన్నవాడికి గురువుకూడా అంతే అవసరం. గురువులలో కొంతమందికి శాస్త్రజ్ఞానం ఉంటుంది కాని ఆత్మానుభవం ఉండదు. కొంతమందికి ఆత్మానుభవం ఉంటుంది కాని టీచింగ్ ఉండదు. నేను రామకృష్ణుడు, రమణుడిని చూడలేదు కాని కంచిపరమాచార్యులను దర్శించాను. విష్ణుకంచిలో పరమాచార్యులవారితో 5 నిమిషాలు మాట్లాడాను. ఆయనలో శాస్త్ర జ్ఞానం ఉంది, అనుభవజ్ఞానం ఉంది. చాలా క్లిష్టమైన విషయాన్ని కూడా చిన్నచిన్న మాటలలో అందరికీ అర్థమయ్యేలాగ చెప్పేశక్తి ఆయనకు ఉంది. బ్రహ్మసూత్రాలలో పిండి ఎక్కువ ఉంది కాని అర్థం చేసుకోవటం కష్టం. కొన్ని సబ్జక్టులు మనం చదువుకొంటే వస్తాయి కాని కొన్ని సబ్జక్టులు ఇతరులచేత చెప్పించుకోవాలి. క్లిష్టమైన విషయాలు వివరించేటప్పుడు పరమాచార్యులవారు చాలా ఎక్కువ టైము తీసుకొనేవారు. గీతలో ఒక శ్లోకం తీసుకొంటే ఇంక దానిని మనం ఇంటికి వెళ్ళి చదవనక్కరలేకుండా, ఆ వాక్యాన్ని మనం ప్రత్యేకంగా ధ్యానం చేయనక్కరలేకుండా ఆయన చెప్పేటప్పుడే అది మన గుండెకు తాకేటట్టుగా చెప్పేవారు.

భగవాన్ దగ్గర కొంతమంది కూర్చొన్నారు. ఎవరో కొత్తగా వచ్చి వీరు ఎవరండీ, వీరు ఎవరండీ అని అడుగుతున్నారు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే ఎవరో అయితే మన దగ్గరకు ఎందుకు వస్తారు వీరు అందరూ మనవాళ్ళే. మనవారు కాబట్టే మన దగ్గరకు వచ్చారు అన్నారు. మనం కష్టపడి చదివేకంటే చెప్పేగురువు ఉన్నప్పుడు శ్రవణం చేయటం మంచిది. అధ్యయనం చేసినప్పుడు కంటే మనం శ్రవణం చేస్తూ ఉంటే ఆ విషయం మనకు

బాగా అర్థమవుతుంది. శ్రవణం చేసినప్పుడు మనకు ఏదైనా డౌట్ వస్తే క్లారిటీ కోసం గురువును అడుగుతాము. గురువు ఉంటే మనం తక్కువ కష్టంతో ఎక్కువ నేర్చుకోవచ్చు. ఆత్మానుభవం, శాస్త్రజ్ఞానం రెండూ ఉన్నవారు చాలా తక్కువమంది ఉంటారు. మనం అవకాశం ఉంటే, గురువు దొరికితే ఆయన ద్వారా శ్రవణం చేయటం మంచిది. రామకృష్ణుడు మొత్తం టైము అంతా శిష్యులకే ఉపయోగించేవాడు. వారు ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావటం గురించే నిరంతరం ఆలోచించేవాడు. అదే పని తప్ప ఆయనకు ఇంకో పని లేదు. గురువు ప్రేమ శిష్యుడి మీద ఎలా ఉంటుంది అంటే రామకృష్ణుడు ఇంకో గంటకు శరీరం విడిచిపెడతాడు అనగా నరేన్‌ను మంచం దగ్గరకు పిలిచాడు. నా శరీరం విడిచిపెట్టే టైము దగ్గరకు వచ్చింది. మానవజాతికి నువ్వు ఉపయోగపడతావు అని నాకు విశ్వాసం ఉంది. అందుచేత నేను సంపాదించుకొన్న ఈ ఆధ్యాత్మిక సంపదను అంతా నీకు ధారపోసి నేను బీదవాడిని అయిపోయి ఈ లోకాన్ని విడిచివెళ్ళిపోతున్నాను. నరేన్ నీకు డౌట్ చేసే స్వభావం ఉంది. అందుచేత నీకు ఏమైనా సందేహాలు ఉంటే తీర్చుకో. హృదయంలో ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకు ఏవో సందేహాలు నిన్ను వెంటాడుతూ ఉంటాయి. అలా వెంటాడేవాటిని ఛేదించు. శాస్త్రవాక్యాన్ని గురువు వాక్యాన్ని ప్రమాణంగా తీసుకో అని చివరగా నరేన్‌తో రామకృష్ణుడు చెప్పాడు. సాధకుడికి అన్నింటికంటే గురువు అనుగ్రహం ముఖ్యం. మనం సందేహాలను ఛేదించాలి. సందేహాలను ఛేదించకపోతే గురువు చెప్పినమాట మన హృదయంలో నిలబడదు. మనం ప్రతీదానికి సందేహించకూడదు. నీ అహంకారం నీకు ప్రమాణంకాదు, నీ గుణాలు నీకు ప్రమాణం కాదు. శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకో అని పరమాత్మ చెప్పాడు. మాయ అంతా గుణాల రూపంలో ఉంది. మన మనస్సు నిదానంగా ఉండదు. మన మనస్సు నిదానంగా ఉ ంటే నిర్మలంగా ఉంటే మనం సత్వగుణంలో ఉంటే, మనకు ఎంతోకొంత జ్ఞానం తాలుక అనుభవం ఉంటే ఈ పోలీస్‌స్టేషన్లు, కోర్టులు, సబ్‌రిజిష్టార్ అఫీసులు ఏమీ అక్కరలేదు, అసలు ప్రభుత్వమే అక్కరలేదు.

హిందూమతం అంటే అది ఒక జీవితవిధానం. మనం శరీరం విడిచిపెట్టే వరకు ఎలా జీవించాలి, సమాజంతోటి, కుటుంబంతోటి మన ప్రవర్తన ఎలా ఉండాలి ఇది అంతా చెపుతారు. అదే సనాతన ధర్మం. ధర్మఅర్థకామమోక్షముల గురించి చెపుతారు. మన మహర్షులు ఏమి చేసారు అంటే ధర్మాన్ని మొదటపెట్టి, మోక్షాన్ని చివరపెట్టి అర్థకామాలను మధ్యలో పెట్టారు. అంటే అర్థకామాలు ధర్మానుగుణంగా ఉంటే నీకు మోక్షం సిద్ధిస్తుంది అని చెప్పారు. అంటే మనం ధర్మాన్ని ఆచరించకుండా లోపల ఉన్న సద్వస్తువు మనకు అనుభవంలోనికి రాదు. ధర్మాన్ని ఆచరించకుండా కేవలం అధ్యయనం చేయటంవలన, శాస్త్రజ్ఞానం వలన మనకు

మోక్షం రాదు. ధర్మాన్ని ఆచరించటం వలన మాత్రమే వస్తువు మనకు అనుభవంలోనికి వస్తుంది. రామకృష్ణుడి దగ్గర లాటూ అనే శిష్యుడు ఉండేవాడు. ఆయనకు చదువులేదు. రామకృష్ణుడు చెప్పిన మాటలను శ్రవణం చేయటంకంటే ఆయన శరీరానికి అవసరమైన పనులు లాటూ చేస్తూ ఉండేవాడు. అశ్చర్యం ఏమిటి అంటే పెద్ద పెద్ద పండితులకు రానటువంటి అనుభవం లాటూకు వచ్చింది. ఎందుచేతనంటే గురువును హృదయపూర్వకంగా విశ్వసించటం వలన, ఎవడైతే రాముడో ఎవడైతే కృష్ణుడో వాడే ఈ రామకృష్ణుడు అని హృదయపూర్వకంగా విశ్వసించి ఆయనకు సేవ చేయటం వలన పెద్ద పెద్ద సాధనలు చేయకపోయినా, శ్రవణం చేయకపోయినా, అధ్యయనం చేయకపోయినా సమాదిస్థితి వచ్చి లాటూను వరించింది. అంటే గురువు అనుగ్రహం ఉంటే ఏదైనా సాధ్యమే.

జ్ఞానానికి పెట్టుబడి ధనంకాదు, తెలుసుకోవాలనే కాంక్ష ఉండాలి. ధనం వలన మనకు జ్ఞానంరాదు, తెలుసుకోవాలనే కాంక్ష ఉంటే అది తెలియబడుతుంది. తట్టండి తెరువబడుతుంది, అడగండి ఇవ్వబడుతుంది అని ఏసు చెప్పాడు. సత్యం మన హృదయంలో ఉంది అది మన ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి అందదు. మనకు అందనంత మాత్రంచేత అది లేదు అని తీర్పు చెప్పకూడదు. అది నీ ఇంద్రియాలకు, మనస్సుకు, బుద్ధికి అందకపోయినా అది అనుభవైక వేద్యం. గురువును మన ఇంద్రియాలతో చూస్తాము అనుకోండి, ఆయన తెలియబడడు. మన మనస్సుతో ఆలోచిస్తాము అనుకోండి ఆయన తెలియబడడు. గురువునే కాదు మన ఎదుటిమనిషిని అయినా మనం ఇంద్రియాలతో, మనస్సుతో చూస్తూ ఉంటే ఆ మనిషి గురించి మనకు సరియైన అవగాహన రాదు. అంతర్‌దృష్టితో చూడాలి. గురువును చూసేటప్పుడు మనస్సుతో కాకుండా, ఇంద్రియాలతో కాకుండా అంతర్‌దృష్టితో చూస్తే ఆయన యొక్క వైభవం మనకు తెలుస్తుంది. మనలో జ్ఞానం సహజంగా ఉంది కాని మనస్సు రూపంలో అజ్ఞానం దానిని కప్పేస్తోంది. అందుచేత మనోనాశనానికి ఎవడైతే కృషిచేస్తున్నాడో వాడికి మాత్రమే సత్యం తెలియబడుతుంది. గురువు యొక్క సహాయసహకారములు లేకుండా మనకు శ్రవణంయందు శ్రద్ధ కలుగదు. వస్తువు గురించి శ్రవణం చేయగా చేయగా దానిని తెలుసుకోవాలనే బుద్ధి మనకు కలుగుతుంది. వస్తువును తెలుసుకోవాలని ఇతరులు నీకు చెప్పటంవేరు, నీ అంతట నీకు ఆ బుద్ధి కలగటం వేరు. ఆధ్యాత్మికంగా బాగుపడాలనే బుద్ధి మనకు కలిగింది అనుకోండి ఇంక మన అభివృద్ధిని ఎవరూ ఆపుచేయలేరు. గురువు యొక్క గైడెన్స్ అడుగు అడుగున అవసరం, కొంతమంది శిష్యులు గురువును ఎన్నుకొంటారు. కొంతమంది గురువుచేత ఎన్నుకోబడతారు. నేను రమణమహర్షిగారిని ఎన్నుకోలేదు, ఆయన చేత ఎన్నుకోబడ్డాను. ఆయన నాకు స్వప్న దర్శనం ఇచ్చి నన్ను ఆశీర్వదించారు. గురువు

అనుగ్రహం కోసం మనం సహనంగా ఉండాలి. సహనం, వివేకం ఉన్నవాడే అభివృద్ధిలోనికి వస్తాడు. కొంతమందికి తెలివి ఉంటుంది, సహనం ఉండదు. కొంతమందికి సహనం ఉంటుంది, తెలివి ఉండదు. ఆధ్యాత్మికంగా అభివృద్ధిపొందాలంటే ఇవి రెండూ అవసరం. రాముడి గురువు వశిష్ఠుడు, కృష్ణుడి గురువు సాందీపుడు, మన దేవతలు కూడా గురువుల దగ్గర నేర్చుకొన్నట్లు కనిపిస్తుంది. ఆచార్యులవారు సర్వజ్ఞుడు, ఆయన కూడా గోవింద భగవద్పాదుల దగ్గర ట్రైనింగ్ పొందారు. రమణమహర్షికి బాహ్యంగా గురువు ఎవరూ కనబడడు కాని అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువు.

పాండవులలో బలహీనతలు ఉన్నాయి, కౌరవులలో కూడా బలహీనతలు ఉన్నాయి. కాని పాండవులను మంచివారు అంటారు, కౌరవులను దుర్మార్గులు అంటారు. పాండవులకు కొన్ని బలహీనతలు ఉన్నాయి కాని వారిలో దుర్మార్గంలేదు, స్వార్థంలేదు. కౌరవులకు బలహీనతలతో పాడు దుర్మార్గం ఉంది, స్వార్థం ఉంది. ఈ రెండూ కలిసి ఉంటే వారివలన సమాజానికి అరిష్టం. పాండవులు ఎప్పడూ సమాజానికి నష్టం తెచ్చిపెట్టలేదు. కౌరవులు సమాజాన్ని పీడించారు. మనిషిలో బలహీనతలు ఉన్నా వాడు స్వార్థపరుడుకాకపోతే, వాడు దుర్మార్గుడు కాకపోతే వాడికి ఎప్పడో ఒకప్పడు జ్ఞానం కలుగుతుంది. మనం చనిపోతే మన కూడా గుండుసూది కూడా రాదు. కాని మన గుణాలు మన కూడా వస్తాయి అందుచేత గుణాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మనలో ఉన్న బలహీనతల వల్లే మనకు జన్మ వస్తోంది. మనిషిలో బలహీనతలు లేకపోతే ఇంకవాడికి శరీరంతో పని ఏముంది. అహంకారం లేనివాడికి శరీరంతో పని ఏముంది, ప్రపంచంతో పని ఏముంది. గురువుకు శరీరం ఉన్నా ఆయన అశరీరుడే. మీరు ఏదైనా మంచిపని కూడా ఆడంబరం కోసం చేస్తే, గౌరవం ఆశించి చేస్తే మీకు జ్ఞానం సున్నా, దేవుని అనుగ్రహం సున్నా. వారు చనిపోయిన తరువాత భగవంతుడు ఏమంటాడు అంటే మీ ముఖాలు ఎప్పడూ చూడలేదు బయటకు పొమ్మంటాడు. అందుచేత మనం ఏ పని చేసినా నిరాడంబరంగా చేయాలి. ఇతరుల మీద పెట్టి చెప్పే బదులు ఆయన మీదే పెట్టుకొని చెప్పే స్వభావం భగవాన్‌కు ఉంది. అక్షరమణమాలలో భగవాన్ ఏమన్నారు అంటే ఓ అరుణాచలేశ్వరుడా! నాలో బలహీనతలు చాలా ఉన్నాయి, చెడు చాలా ఉంది. ఈ కుట్రనంతా బయటకు లాగి కాల్చి బూడిద చేసి నన్ను సద్గుణాలతో అలంకరించు అన్నారు. లౌకికులకంటే భక్తులే భారతీయ సాహిత్యాన్ని ఎక్కువ పెంచి పోషించారు. మన గురువులు అందరూ కూడా ఒక ప్రక్కన మనకు గైడెన్స్ ఇస్తూ దేశభక్తిని, దేశసమైక్యతను ఎలా కాపాడుకోవాలో టీచ్ చేసారు. ఎక్కడో కేరళలో కాలిడి అనే చిన్న గ్రామంలో జన్మించిన ఆచార్యుడు కాశ్మీర్ వరకు తిరిగి బోధించాడు, అన్ని రాష్ట్రాలు మనవే అని చెప్పాడు ఎక్కడా

వేరుభావన లేదు.

గౌతమబుద్ధుడు నిర్వాణస్థితి అని చెప్పాడు, మనవారు మోక్షం అని చెప్పారు. పేరులు తేడా కాని ఉన్నది ఒక్కటే. నిర్వాణం అంటే ఆరిపోవటం. దేహాన్ని కేంద్రంగా, మనస్సును కేంద్రంగా పెట్టుకొని వచ్చే ఆలోచనలు, తలంపులు అన్నీ కూడా పూర్తిగా శేషం లేకుండా ఆరిపోవాలి అప్పుడుగాని నిర్వాణస్థితి రాదు దీనినే మనవారు మోక్షం అన్నారు. మోక్షం అంటే విడుదల అంటే అవిద్యలో నుండి, అజ్ఞానంలోనుండి మనం విడుదల పొందాలి. ఇప్పుడు నువ్వు నేను, నేను అంటున్నావు కదా. ఆ నేను నేను కాదని తెలుసుకోవటమే జ్ఞానం అన్నారు రామకృష్ణుడు. ఆ నేను నేను కాదని తెలిసిన వెంటనే నీ హృదయంలో ఉన్న సత్యం నీకు స్ఫురిస్తుంది. హ్యూమన్ కాండక్టు ఎలా ఉండాలి, హ్యూమన్ బిహేవియర్ ఎలా ఉండాలి అనే విషయాలు వివరంగా వేదంలో చెప్పారు. భగవద్గీతలో కూడా చెప్పారు. మీరు నాలుగు వేదాలు చదవాలంటే చాలాకాలం పడుతుంది, అర్థం చేసుకోవటానికి మన జీవితం సరిపోదు. సుభాష్‌చంద్రబోసు పైకి భక్తుడి కింద కనిపించడు. ఆయన ఒక సందర్భంలో ఏమని చెప్పాడు అంటే భగవద్గీత చిన్న గ్రంధం, ఈ భగవద్గీత ఎవరి జేబులో ఉందో వాడి జేబులో నాలుగు వేదాలు ఉన్నట్లే అని చెప్పాడు. చాలా వండర్‌ఫుల్‌గా చెప్పాడు అనిపించింది. వేదానికి స్వరం ఉంటుంది ఎందుచేతనంటే అది మంత్రం. వేదం చదివే వాడికి దాని అర్థం తెలియకపోయినా, వింటున్న మనకు తెలియకపోయినా శ్రద్ధగా ఆ స్వరం వింటూ ఉంటే మనకు మనోనిగ్రహం కలుగుతుంది.

మనం ఎవరిని చూసి అసూయపడకూడదు. ఎవరి చూసి అసూయపడుతున్నామో వాడు చెడిపోడు కాని అసూయపడటంవలన మన ఆరోగ్యం చెడిపోతుంది. ధర్మరాజుకు భగవద్గీత చెప్పవచ్చుకదా అర్జునుడికి చెప్పాడు ఏమిటి అని కొంతమంది అంటారు. ఓ అర్జునా! ఎవరిని చూసి నువ్వు అసూయ పడలేదు, నీవు అనసూయుడవు. ఆ గ్రేట్ క్వాలిటీని చూసి లొంగిపోయి నీకు భగవద్గీతను బోధిస్తున్నాను అన్నాడు పరమాత్మ. ఎక్కడైతే అర్జునుడు ఉన్నాడో, ఎక్కడైతే కృష్ణుడు ఉన్నాడో అక్కడ విజయం కలుగుతుంది. అర్జునుడు అంటే కృషి, కృష్ణుడు అంటే కృప. అంటే మనం ప్రయత్నం చేయాలి, భగవంతుని దయ ఉండాలి. ఈశ్వరుని దయలేకుండా అసలు మనకు ప్రయత్నం చేయాలనే బుద్ధి కూడా కలుగదు. మనకు ఎప్పుడైనా గురువు జ్ఞాపకం వస్తున్నాడు అనుకోండి అది మన తెలివితేటలు కాదు. ఆయన మనలను స్మరిస్తే ఆయన మన స్మరణలోనికి వస్తాడు. మనం దేనికి తొందరపడకూడదు. కాలం కలిసి రావాలి. కొందరు ఎంత ప్రయత్నం చేసినా ఆ పనిలో రిపీటెడ్‌గా ఫెయిల్ అవుతూ ఉంటారు. ఈశ్వరకటాక్షం లేకపోతే మనం ప్రయత్నం చేసినా ఆ పని సఫలం అవ్వదు. భౌతికంగా కాని,

ఆధ్యాత్మికంగాకాని నీవు సఫలం అవ్వాలంటే నీ ప్రయత్నం, భగవంతుని దయ రెండూ అవసరమే. నాలుగు శ్లోకాలు చెప్పిన తరువాత భగవాన్ ఉవాచ అని వ్యాసుడు చెపుతాడు. అంటే ఇది నేను చెప్పటంలేదు. చెప్పేవాడు సామాన్యుడుకాదు. మనలో అంతర్యామిగా ఉన్న నారాయణుడే చెపుతున్నాడు అంటే భగవంతుడే చెపుతున్నాడు అని చెప్పటం. భగవంతుడే ఈ శ్లోకం చెపుతున్నాడు అని మీకు గుర్తు ఉన్నప్పుడు మీకు భక్తి పెరుగుతుంది. ఆ శ్లోకం మీకు అర్థమైతే మీ శోకం పోతుంది. భగవంతుడిని మనం ప్రార్థించగా ప్రార్థించగా, ఆయనపట్ల విశ్వాసం పెంచుకొంటే ఆయనే గురురూపంలో శరీరం ధరించి వచ్చి మనకు బోధిస్తాడు.

ఏ కుటుంబానికి అయినా కనీస అవసరాలకు ఎక్కువ డబ్బు ఖర్చు అవ్వదు. మనం అవసరాలను పెంచుకోకూడదు. అవసరాలను పెంచుకొంటే ఆరోగ్యం చెడిపోతుంది. అవసరాలు పెరిగేకొలది క్రమంగానో, అక్రమంగానో డబ్బు సంపాదించాలనే ఆలోచన వస్తుంది, దాని వలన బ్రెయిన్ పాడైపోతుంది. అర్థకామాల విషయంలో చాలా కంట్రోలులో ఉండాలి. వ్యాసుడు ధర్మస్వరూపుడు, కృష్ణుడు మోక్ష స్వరూపుడు. ఎలా మోక్షం పొందాలి అని కృష్ణుడు బోధిస్తే ధర్మానికే విజయం కలుగుతుంది అని వ్యాసుడు భారతంలో చెప్పాడు. నువ్వు ధర్మాన్ని రక్షిస్తే నీవు ధర్మంచేత రక్షింపబడతావు అని వ్యాసుడు చెప్పాడు. నీకు ఏదైనా కోరిక వస్తే దానిని వెంటనే ఆచరణలో పెట్టకు. దానిని నెమ్మదిగా కంట్రోలు చేసుకొంటే ఆ కోరిక నెరవేరిన దానికంటే దానిని కంట్రోలు చేసుకోవటం వలన నీకు ఎక్కువ తృప్తి వస్తుంది, శాంతి కలుగుతుంది అని అరవిందుడు చెప్పాడు. పిల్లలు చాలామంది పాడైపోవటానికి కారణం సినిమాలు, టీవీలు. వాళ్ళ బ్రెయిన్ పాడైపోయే దృశ్యాలు చూపిస్తున్నారు. ఆధునిక నాగరికత అని చెప్పి బాగుపడేబదులు మనం పాడైపోతున్నాము. డబ్బు వచ్చేటప్పుడు ఎలా వస్తుందో తెలియదు, పోయేటప్పుడు ఎలా పోతుందో తెలియదు. కాలప్రవాహంలో మన శరీరమే పోతోంది కదా ఇంక ఆ శరీరంతో సంపాదించింది ఎలా మిగులుతుంది. అమెరికాలో ధనవంతులు ఉన్నా పిల్లలకు డబ్బు ఎక్కువ ఇవ్వరు, దానివలన పిల్లలు పాడైపోతారు అని చెపుతారు. మన ఇండియాలో ఉన్న ధనవంతులకంటే అమెరికాలో ఉన్న ధనవంతులు ప్రజలకు ఎక్కువ ఉపయోగపడతారు. ఎందుచేతనంటే మనకు ఎటాచ్‌మెంట్ ఎక్కువ, అమెరికాలో ఎటాచ్‌మెంట్ తక్కువ. కోడలు అడిగితేనేగాని మనం వేరుకాపురం పెట్టము, వాళ్ళు అయితే మీ బతుకు మీరు బతకండి అని చెపుతారు అంటే ఇష్టంలేకకాదు స్వతంత్ర్యంగా బతకాలి. ఇక్కడ ఎక్కువ పనిదొంగలు, కాని వారు కష్టపడి పనిచేయుటం వలన ధనవంతులు అయ్యారు. మీరు చదువుకొన్నా, డబ్బు సంపాదించినా ప్రయోజనం లేదు. మీకు చెడు అలవాట్లు వస్తే మీ చదువు, డబ్బు దుర్వినియోగం అయిపోతాయి.

సన్యాసం అంటే ఎర్రబట్టలు కట్టుకోనక్కరలేదు. ఎవడికైతే అసూయ, స్వార్థం, కోపం, కోరికలు లేవో వాడు ఏ బట్టలు కట్టుకొన్నా నిత్యసన్యాసితో సమానము. మనం ఏ ఇంటికి వెళ్ళి చూసినా, ఏ ప్రాంతానికి వెళ్ళినా, ఏ దేశం వెళ్ళినా రాగద్వేషములు తప్పించి ఇంకోటి కనబడదు. మనిషి పాడైపోవటానికి రాగద్వేషాలే కారణం. మీకు ఎక్కడా ఇష్టంలేదు అనుకోండి, అయిష్టం లేదు అనుకోండి ఇంక మీ మనస్సును కదలమన్నా కదలదు. ఈ సృష్టిలో ఏ విషయం గురించి దుఃఖపడేది ఏమీలేదు. నీ జీవితంలో కుటుంబ పరంగాగాని, సమాజపరంగా గాని ఏమన్నా జరుగుతూ ఉంటే ఈ విషయం ఇలా జరుగుతోంది ఏమిటి అని కంగారు పడవలసిన పనిలేదు, అది భగవంతుడికి తెలియకుండా జరగటంలేదు. వారు నావారు అనుకోవటం వలన నీకు దుఃఖం వస్తోంది. దీనికి ఎటాచ్‌మెంట్ కారణం. ఎవరు ఎవరికి ఏమీ అవ్వరు. ఇది అంతా స్వప్న సమానము. మన మనస్సు అలా అనిపింపచేస్తోంది. మనస్సు వచ్చాక శరీరం, ప్రపంచం, రాగద్వేషాలు అన్నీ వస్తున్నాయి. ఆ మనస్సు నశిస్తే ఏమీ లేదు. మన జీవితాలు తెగిపోయిన గాలిపటాలలాగ లేవు. భగవంతుడు మనలో అంతర్యామిగా ఉండి దేహప్రారబ్దాన్ని బట్టి మనలను నడుపుతున్నాడు. మనం ఎప్పుడు ఎక్కడ ఎలా ఉండాలి, మన జీవితంలో ఏమి జరగాలో కర్మఫల సంయోగం చేస్తున్నాడు పరమాత్మ. మీ శరీరాలు అన్నీ యంత్రాలకు తగిలించిన బొమ్మలలాంటివి. ఆ యంత్రానికి ఆపరేటర్ పరమాత్మ, ఆయన ఎలా నడిపిస్తే ఈ బొమ్మలు అలా నడుస్తాయి. మనం స్వతంత్రులం కాదు. ఈ లోపుగా మనం అది సాధించాము, ఇది సాధించాము అనుకొంటాము, దీనికి మనలో ఉన్న గుణాలు కారణం, అజ్ఞానం కారణం. ఈ అజ్ఞానంలో నుండి, దేహాభిమానంలోనుండి బయటకు రావటానికి గురువు అవసరం. మీరు సత్వగుణం పెంచుకొని గురువును సమీపించి శ్రద్ధగా అడిగి ఆత్మజ్ఞానం గురించి నేర్చుకోండి అని పరమాత్మ చెప్పాడు. మన స్వాములు చాలామంది కంటే ఐన్‌స్టీన్ బాగా చెప్పాడు. ఆయనది ఇంపెర్సనల్ లైఫ్. ఆయన తన స్నేహితులను పిలిచి నేను చనిపోయాక ఎవరికి చెప్పకండి, ఊరేగింపులు వద్దు, ఈ శరీరాన్ని కాల్చి బూడిదచేసి నదిలో కలిపేయండి అని చెప్పాడు. ఏదైనా మంచిపని చేసి పదిమంది గుర్తించాలి అని అనుకొంటే మనకు దేహబుద్ధి పెరిగిపోతుంది. భవిష్యత్‌లో శవాలను మోయవలసిందే. రాగద్వేషాలనుండి ఎవడైతే విడుదల పొందాడో వాడు మోక్షంకోసం కష్టపడవలసిన పని లేదు, వాడికి చాలా సహజంగా మోక్షం వస్తుంది.

మనలో ద్వేషబుద్ధి ఎక్కువగా ఉంది. గీతలో భగవంతుడు చెప్పింది మనం ఆచరించకపోయిన అమెరికన్స్ ఆచరిస్తున్నారు. గ్రంథం మనది అయినా వాళ్ళు దానిని ఆచరించి బాగుపడుతున్నారు. ప్రాక్టికాలిటీ ముఖ్యం. మనం ఏదైనా మంచి విన్నాము

అనుకోండి, దానిని రిపీట్ చేసుకొనే బదులు దానిని ప్రాక్టీసు చేయటానికి ప్రయత్నం చేయండి. వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అని జడ్జిమెంట్స్ చెప్పకు. నీ పని ఏదో నువ్వు చూసుకో. ప్రతీవాడి గురించి జడ్జిమెంట్ చెపితే నీవు పాడైపోతావు. వాడు మంచివాడు అయితే భగవంతుడు రివార్డు ఇస్తాడు, వాడు చెడ్డవాడు అయితే పనిష్మెంట్ ఇస్తాడు, అది అంతా భగవంతుడు చూసుకొంటాడు. భగవంతుడు చేసేపని నీకు ఎందుకు. నీవు బాగుపడేవిధానం చూసుకో. ఇతరుల విషయాలలో కలుగజేసుకొంటే నీకు అహంకారం పెరుగుతుంది. అందరిపట్ల సమాన దృష్టిని కలిగియుండు. విద్య, వినయం ఉన్న ఉత్తమ బ్రాహ్మణుడిపట్ల, కుక్క మాంసం తినే చండాలుడిపట్ల, జంతువులపట్ల, సమస్త జీవరాశులపట్ల ఎవడైతే సమానదృష్టి కలిగి ఉంటాడో వాడు జ్ఞాని అవుతాడు. కుక్కమాంసం, పందిమాంసం తింటున్నారని వారిని అసహ్యించుకోవద్దు. మాంసం తినటం అనేది ఒక గుణం. ఈ గుణాలు అన్నీ మనస్సులో ఉన్నాయి. ఈ గుణాలను అతిక్రమించటమే మాయను అతిక్రమించటం. నా దయ లేకుండా నా మాయలో నుండి ఎవడూ విడుదల పొందలేడు అని పరమాత్మ చెప్పాడు. వాడు మంచివాడు, వీడు చెడ్డవాడు అని మంచి చెడ్డల జోలికి వెళ్ళవద్దు. లోపల అందరిని సమానంగా చూస్తూ ఉండు. అప్పడు ఆత్మజ్ఞానానికి ఫౌండేషన్ పడుతుంది. ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం మనకు కలిగితే నూటికి ఏభై మార్కులు వచ్చినట్లే. విశ్వాసం కనుక ఉంటే నీవు కొండలను కూడా కదపగలవు. గురువు అంటే సామాన్యుడు అనుకోకు, ఈశ్వరుడే గురురూపంలో వచ్చి మనకు బోధిస్తున్నాడు. ఈశ్వరాంశ లేకపోతే, దైవకృప అక్కడ లేకపోతే టీచింగ్ కూడా సాధ్యంకాదు.

మీరు శ్రవణం చేస్తున్నారు, నేను వక్తగా ఉండి నాలుగు మాటలు చెపుతున్నాను. నాకు లాభం ఏమిటి అంటే నాకు అనుభవంలో ఉన్న మాటలు చెపుతున్నానో, అనుభవంలో లేని మాటలు చెపుతున్నానో నాకు తెలుస్తూ ఉంటుంది. వినేవారికి అవి ఎంత వరకు అర్థమైతే అంత లాభం. మీరు బాగుపడటానికి గీతలో ఉన్న ఒక్క శ్లోకం అర్థమైతే చాలు. ఆ శ్లోకం మీకు అర్థమవుతూ ఉంటే మీలో ఎంత అశాంతి ఉన్నా వెంటనే ఆరిపోతుంది. అర్థం చేసుకోవటం కూడా ఒక యోగం. ఉన్నది భగవంతుడు ఒక్కడే. ఆయనలో ఐక్యమవ్వటమే యోగం యొక్క ఫలితం. శరీరం ఉండగానే రాగద్వేషములు తగ్గించుకొంటే జీవన్ముక్త స్థితిని పొందుతావు. లోపల ఉన్న సద్వస్తువు ఎప్పడైతే నీకు అనుభవంలోనికి వచ్చిందో అప్పడు శరీరం ఉండగా శరీరం లేని స్థితిని, మనస్సు ఉండగా మనస్సు లేని స్థితిని, లోకం ఉండగా లోకం లేని స్థితిని పొందుతావు. జీవలక్షణాలు నశించినవాడికి ఇంక రావటంలేదు, పోవటం

లేదు. ముందుగా మీరు అందరి క్షేమం కోరటం నేర్చుకోండి. మీ దగ్గర పైసలు లేకపోయినా అందరి క్షేమం కోరటానికి మానసిక దారిద్ర్యం ఎందుకు. మనకు వచ్చే ప్రతి తలంపుకు, మనం మాట్లాడే ప్రతిమాటకు భగవంతుడు సాక్షిగా ఉన్నాడు వీటి గురించి ఎప్పటికైనా మనం భగవంతుడికి జవాబు చెప్పాలి అనేది జ్ఞాపకం ఉంచుకోండి.

నీలోపల ఉన్న బలహీనతలను అంతర్యామిగా ఉన్న గురువు నీకు చూపిస్తూ ఉంటాడు. వాటిని తొలగించుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తూ ఉంటే ఆయన సహాయం అందిస్తాడు. గురువు అనుగ్రహంలో పడ్డవాడు ఈనాటికైనా, ముందునాటికైనా తరించి తీరతాడు, గురువు అనుగ్రహం బలీయమైనది. లోపల ఉన్న సద్వస్తువును తెలుసుకోవటానికి నీలో ఉన్న ఏ గుణాలు, ఏ బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి ఈ శరీరం భూమి మీద తిరుగాడుతున్నప్పడే సాధన చెయ్యి. సందేహాలు పెట్టుకోవద్దు. సందేహాలు పెట్టుకొంటే మీకు లోచూపు రాదు. మీకు సందేహాలు ఉంటే గురువును ఆశ్రయించి, వినయంగా అడిగి వాటిని తొలగించుకో. మీకు అవకాశం ఉంటే సజ్జనుల సమక్షంలో, మహాత్ముల సమక్షంలో ఒక గంట కూర్చోండి. అలా కూర్చోవటం వలన వారి వైబ్రేషన్స్ మీ మీద పనిచేస్తాయి, మీ మనస్సుకు తొందరగా లోచూపు కలుగుతుంది. ఆచార్యులవారు బోధ స్వరూపులు. రాముడు, కృష్ణుడు బయట రాక్షసులను చంపితే ఆచార్యులవారు ఆయన బోధ ద్వారా లోపల ఉన్న రాక్షసులను చంపటానికి ప్రయత్నం చేసారు.

నీ బుద్ధిని బాగుచేసుకో. బుద్ధికి ఏకాగ్రత నేర్పు అప్పడు విషయాన్ని తొందరగా గ్రహిస్తుంది. ఎవడికైతే సమానబుద్ధి ఉందో, ఎవడైతే అందరి క్షేమాన్ని కోరుతున్నాడో, ఎవడికైతే మానసిక దారిద్ర్యం లేదో వాడికి శరీరం ఉన్నా మోక్షం, శరీరం పోయినా మోక్షం, వాడు స్వతంత్రుడు అవుతాడు. ఆహార విహారాలలో యుక్తంగా ఉండండి అప్పడు సాధన చేసుకోవటానికి మీ శరీరం సహకరిస్తుంది. మనం అన్నం తిన్న తరువాత అరటి ఆకు బయట పడేస్తాము, ఇంక దాని గురించి మనకు ఆలోచన లేదు. జ్ఞాని దేహాన్ని విడిచిపెట్టినప్పడు అలాగే ఉంటాడు. ఎందుచేతనంటే దేహం పోయిన తాను ఉంటాను అని జ్ఞానికి తెలుసు. నీవు ఏ పని చేసినా నిరాడంబరంగా చెయ్యి, నిరహంకారంగా చెయ్యి, నిర్మలబుద్ధితో చెయ్యి. నీ బుద్ధిని బాగుచేసుకోవటంకంటే మించిన పని ఈ లోకంలో ఏమీ లేదు. సంవత్సరం పొడుగునా గురువు నీకు అందించిన సహాయ సహకారములకు కృతజ్ఞత తెలియచేయటానికి, ఆయనను గౌరవించటానికి గురుపూర్ణిమ ఏర్పాటుచేసారు. ఈ రోజున గురువులను స్మరించుకొని, వారు చెప్పిన సందేశాలను జ్ఞాపకం పెట్టుకొని గురు ఋణాన్ని తీర్చుకోవటానికే గురుపూర్ణిమను పెద్దలు ఏర్పాటుచేసారు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| ఆగస్టు | 12 | శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |
| సెప్టెంబర్ | 1 | శ్రీకృష్ణాష్టమి, శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha



**పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలో**
**"శ్రీ విజయకృష్ణ ఆర్థోపెడిక్ హాస్పటల్"ను**
**జూన్ 6వ తేదిన సద్గురు శ్రీ నాన్నగారు ప్రారంభోత్సవం చేసినారు.**
**సద్గురు శ్రీ నాన్నగారికి ఎడమ ప్రక్కన ఉన్నవారు డా॥ శ్రీగుర్ర వెంకట సుబ్బారావుగారు.**

## గమనిక

మీ చందా గడువు **ఈ నెలతో** ముగియుచున్నది. కావున మీ చందాను **2010-11** సంవత్సర కాలానికి **రు॥ 150/-**లను స్వయంగాగాని, డిడి రూపంలో గాని పంపి **రెన్యువల్** చేయించుకోవలసినదిగా కోరడమైనది.

# దారి చూపే గురువు లేకపోతే - ఎవరైనా అంధులే - 2

సద్గురువు శరీరధారియై ఉన్న స్థితిలోనే మనకు అక్కడ పరమాత్మగా ఆ సహాయం అందుతుంది. నీ ఆత్మకు ఆత్మగా యుండే పరమస్థితిలో అది సాధ్యం. మనకు ఈ విషయంలో సమగ్రమైన అవగాహన కుదిరినప్పుడు మనం చేయవలసిన ప్రతీ ప్రయత్నంలోనూ ఈ జాగృతి మనకు అడుగడుగునా లభిస్తూ సహాయం చేస్తాడు. ఎవరి సమక్షంలో ఉన్నా ప్రతీవారి మీద ఆయన సౌందర్యతేజం విరజిమ్ముతూ ఉంటుందో వారే సద్గురువులు. గురువు ప్రపంచంలోని గొప్ప గ్రంథాలనుండి వారు నేర్చుకొనేది ఏదీ లేదు. వారి జీవితం ఉన్నంతకాలం పవిత్రదర్శనం పావనత్వాన్ని, ఆనందాన్ని వెదజల్లుతుంది. భగవాన్ "నా అనుగ్రహం లేనివాడు నా పేరు కూడా ఎత్తడు" అన్నారు. ఆరాధన అంటే మనస్సును సత్యస్వరూపుడైన గురువుపై అనుసంధానం చెయ్యటమే. మొదట్లో శిష్యుడు గురువుకు సన్నిహింతం కావాలి అంటే ప్రేమ, విశ్వాసం నమ్మకం కావాలి. ఇది దూరాన్ని కాలాన్ని నాశనం చేస్తుంది. మనం ఎక్కడ ఉన్నా ఆయన అనుభవం కలిగితే మన శరీరాన్ని అధిగమించగలము భూమి మీద ఆయన ఎక్కడ ఉన్నా ఆయన సహాయం అందుతుంది. ఆయన రహస్యంగా కనిపించకుండా ఉన్నా కనిపించని చేతులతో సహాయం చేస్తారు మనలను అనుసరిస్తారు. మనం కళ్ళు మూసుకొని ఆయనను అనుసరించటమే మన పని. గురువు మనలను దూరంగా పంపినా ఆయన్ని పట్టుకొని వేళ్ళాడాలి అదే చాలు అని విశ్వసించాలి. ఆయనకు దూరంగా ఉండటం ఆయనకు దగ్గర అవ్వటమే అది కొత్త దగ్గరతనాన్ని సాధిస్తాము ఈ అవగాహనతోనే మనస్సు నశిస్తుంది. జీవన విధానంలో అన్నివేళలా గురు సమక్షంలో ఉండటం జరగని పని. మనకు గురు వాక్యాలే గురు స్వరూపం వాటిని మననం చెయ్యాలి అప్పడే గురు సమక్షం మనకందరికీ అందుబాటులో ఉంటుంది. శరీరాన్ని అమ్మా-నాన్న పోషిచారు. తరువాత గురువు బాధ్యత ప్రారంభమౌతుంది. ఎంత దుర్మార్గుడైనా 'గురువుగారూ' అంటూ కాళ్ళమీద పడితే చచ్చినట్లు మంచిగా మార్చవలసిందే. అతి పవిత్రమైన మహాగురువు గురుదేవులు అనటం మామూలే. "గురువును ఆశ్రయించే శివరూపాన్ని తెలుసుకోవాలి శివునికంటే గురువే గొప్పవాడు" అని రుద్రయామళము. గురువు దగ్గర ఉన్నవి మన సొంతం. మన అవలక్షణాలు ఆయన సొంతం. ఆయన శాశ్వత మిత్రుడు. "ఉదాత్త ఆలోచనలు వస్తే కార్యరూపం తీసుకొనిరా నీవు శక్తిశాలివి నా ఆశీస్సులు నీకు ఉన్నాయి" అంటారు గురువులు. గురువు మీద ప్రేమ దివ్యత్వమనే నిచ్చెనకు తొలిమెట్టు. "గురువు నాకు ఇంత ఎందుకు చేస్తున్నాడు? నా నుండి ఏమి కావాలి అనుకొంటాడు" శిష్యుడు. మనకు దారి చూపటమే ఆయన లక్ష్యం. అది పూర్వజన్మ సుకృతం అంతే.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం